క్లుప్తంగా

శ్రీవారికి విశేష పూజలు


గంధపు లేపనం అలంకారంలో వేంకటేశ్వరస్వామి

ఆదోని అర్బన్ : స్థానిక ఉప్పరవీధి ఇందిరానగర్‌లోని ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శని వారం విశేష పూజలు జరి గాయి. శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి భక్తబృందం ఆధ్వర్యంలో తెల్ల వారుజామున స్వామివారికి నవ కళ సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విష్ణు సహస్ర నామావళి, సుప్రభాతసేవ తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి రమణాచార్యులు, భక్తబృందం సూర్యమనోహర్‌శెట్టి, బుశెట్టిసురేష్, పెండేకల్ శివ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


రణమండల ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి శ్రవణా నక్షత్రం సందర్భంగా శని వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టి.జి.పాండయ్య,కార్తీకమాస నిత్య సేవాసమితి ఆధ్వర్యంలో స్వామి వారికి ఫలపంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సింధూరసేవ, తులసీ హారం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కౌతాళంలో..


కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రం, బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో, అగసలదిన్నెలోని ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారం కావడంతో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. బుడుములదొడ్డిలో సీతారాములకు రథోత్సవం జరిపించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: పట్టణంలోని 20వ వార్డులోని అర్హులైన 128 మంది పేదలకు శనివారం ఇళ్ల పట్టాలు,మంజూరైన పక్కాగృహాల పత్రాలను వార్డు కౌన్సిలర్ లక్ష్మీమధు, వార్డు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. మధు మాట్లాడుతూ దళిత వార్డు కావడంతో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి దళితుల అభివృద్ధికి, గూడులేని నిరుపేదలకు ఇంటి స్థలం,పక్కా ఇల్లు మంజూరు చేయించారని చెప్పారు. 'మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు.గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై.. గుడిసె దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోని అర్బన్ : పట్టణంలోని వాల్మీకి నగర్‌లో లలితమ్మ, లక్ష్మీనారాయణ నివాసముంటున్న గుడిసెలో శనివారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి.స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో దేవరకోసం తెచ్చుకున్న నిత్యావసర సరుకులు, రూ.లక్ష నగదు, మంటల్లో కాలి బూడిదయ్యిందని వాపోయారు. తాము గుడిసెలో బాడుగకు ఉంటున్నామన్నారు. వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళనతో కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2023 పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శిక్షణతరగతులు ప్రారంభమవుతాయని, పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచింగ్ తీసుకునే ప్రతి అభ్యర్థికి ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని, మే 10వ తేదీన ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ 8121555646 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ యార్డులో వసూళ్ల పర్వం

- కమీషన్ ఏజెంట్ల లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.30 వేలు చెల్లించాల్సిందే
- ఆదోని యార్డులో 345 దుకాణాలు,450 మంది ఏజెంట్లు
- 241 మంది లైసెన్స్‌కు ముగిసిన గడువు
- అసోసియేషన్ ఆధ్వర్యంలో వసూళ్లు చేసేలా అధికారుల మంత్రాంగం
- నేరుగా రెన్యూవల్‌కు వెళ్తే అంగీకరించని సిబ్బంది
- అసోసియేషన్ కార్యాలయం నుంచి అప్లికేషన్ తేవాలని చెబుతున్న వైనం
- అక్కడ అప్లికేషన్ పొందాలంటే.. ఆ మొత్తం ఇవ్వాల్సిందే
- ఇప్పటికే 205 మంది చెల్లింపు

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వసూళ్ల పర్వం జోరుగా సాగుతుందనే ఆరోపణలున్నాయి. యార్డులోని కమీషన్‌దారులు లైసెన్సు రెన్యూవల్ చేసుకోవాలంటే రూ.30 వేలు చెల్లించాల్సి వస్తోంది. యార్డులో రైతులు తెచ్చిన పంట దిగుబడులను రైతులకు, వ్యాపారులకు మధ్య విక్రయాలు చేయాలంటే లైసెన్సు పొందిన కమీషన్ ఏజెంట్లు ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యార్డులో లైసెన్సు ఉన్న వారు ఐదేళ్లకొకసారి రెన్యూవల్ చేయించుకోవాలి. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 345 దుకాణాలు ఉన్నాయి. అందులో 450 మంది లైసెన్స్ ఉన్న కమీషన్ ఏజెంట్‌లు ఉన్నారు. ఈ ఏడాది 241 మంది ఏజెంట్ల లైసెన్సు గడువు ముగిసింది. వ్యాపారాల్లో పాల్గొనాలంటే వారంతా తప్పనిసరిగా లైసెన్సు రెన్యూవల్ చేయించుకోవాలి. చేయించుకోకపోతే ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఇనామ్‌లో వారి పేరుమీద ఉన్న లైసెన్సు హోల్డ్‌లో పడుతుంది.


ఆదోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

అసోసియేషన్ ద్వారా వసూళ్లు

గత సంవత్సరం రెన్యూవల్‌కు వచ్చిన వారి నుంచి రూ.36 వేల ప్రకారం తీసుకొని రెన్యూవల్ చేయించారని సమాచారం. ఇదే తరహాలో అయితే కష్టమని.. అసోసియేషన్ నాయకులు అధికారులతో కూర్చొని ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలిసింది. యార్డు చైర్మన్ పదవి కాలం గత నెలలో ముగియడంతో డీల్ అంతా అధికారుల ఆధ్వర్యంలో జరిగినట్లు సమాచారం. సిబ్బందితో వసూళ్లు చేయిస్తే బాగుండదని, అసోసియేషన్ ద్వారా చేసి ఇవ్వాలని చెప్పడంతో నాయకులు రంగంలోకి దిగారు. రెన్యూవల్‌కు సంబంధించి అప్లికేషన్ ఫారాలు అసోసియేషన్ నాయకులకు అధికారులు అందజేశారు. రెన్యూవల్ చేసుకునే వారు అప్లికేషన్‌ను అసోసియేషన్ నుంచి పొందాలి. అలా పొందాలంటే నిర్దేశించిన రూ.30వేలు తప్పనిసరిగా చెల్లించాలి. అక్కడి నుంచి వెళ్తేనే అధికారులు రెన్యూవల్ చేస్తున్నారు.

నేరుగా వెళ్తే..

కమీషన్ ఏజెంట్లు రెన్యూవల్ కోసం సంబంధిత సూపర్‌వైజర్ అధికారి వద్దకు తగిన డాక్యుమెంట్లు, ధ్రువపత్రాలు తీసుకొని వెళ్తే రెన్యూవల్ చేయడం లేదు. రెన్యూవల్‌కు సంబంధించిన అప్లికేషన్‌లు అసోసియేషన్ నాయకుల వద్ద ఉన్నాయి. అక్కడ తీసుకొని జతచేసి ఇవ్వాలని చెబుతున్నారని కొందరు ఏజెంట్లు వాపోతున్నారు. 241 మంది ఏజెంట్ల నుంచి రూ.30 వేల చొప్పున వసూలు చేస్తే మొత్తం రూ.72.30 లక్షలు అవుతుంది. కాగా ఇప్పటి వరకు 205 మంది డబ్బులు చెల్లించారని తెలిసింది. గతంలో ఏడాదికి వెయ్యి చొప్పున తీసుకునే వారని, ఈ అధికారి మాత్రం ఇంత మొత్తం ఇవాల్సిందేనని చెప్పడం సరికాదని పలువురు ఏజెంట్లు వాపోతున్నారు.

ఎవరెవరికి ఎంతెంత..

వసూలు చేసిన రూ.30 వేలలో రూ.5 వేలు యార్డు చలానాకు, రూ.5 వేలు అసోసియేషన్ ఖర్చులకు పోనూ మిగిలింది రూ.20 వేలు యార్డుకు ఇవ్వాల్సిందేనని ఏజెంట్లు చెబుతున్నారు. ఇదేకాకుండా సిబ్బందికి కూడా ఇవ్వాల్సి వస్తుందేమోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులుగా.. హోంగార్డులు..

యార్డులో సీనియర్ హోంగార్డులు ఇద్దరు అధికారులుగా చెలామణి అవుతున్నారు. వారికి మార్కెట్‌లో ఏమి జరిగినా, ఎవరు ఏమి చేస్తున్నారో అనే విషయాలపై పూర్తిగా అవగాహన ఉండడంతో అధికారులు ప్రోత్సహిస్తున్నారు. మాట వినని ఏజెంట్ల విషయంలో కల్పించుకొని సరిచేయడమే వీరి పని.

నేరుగా వస్తే రూ.5 వేల చలానాతో రెన్యూవల్ చేస్తాం



ఏజెంట్లు నేరుగా తన వద్దకు వస్తే నిబంధనల ప్రకారం రూ.5 వేల చలానాతో చేయిస్తాం. రూ.5 వేలు లైసెన్సు ఫీజు, రూ.20 వేలు సెక్యూరిటీ డిపాజిట్, సెల్ఫ్ అఫిడవిట్, మూడేళ్ల టర్నోవర్ వివరాలు, దుకాణాల అద్దె, పవర్ బిల్లు, నో డ్యూ సర్టిఫికెట్‌లను దరఖాస్తుకు జతచేయాలి. రూ.30 వేల వసూళ్లపై తనకు తెలియదు. ఎవరు వసూలు చేస్తున్నారో విచారణ చేపడతాం. - శ్రీకాంత్, యార్డు సెక్రటరీ

హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్


మండిగిరిలో ఇంటి యజమానికి జగనన్న పాలన గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కోసిగిలో వృద్ధ దంపతులకు పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 18, 19 వార్డుల కౌన్సిలర్లు చలపతి, లక్ష్మీమధు, ఫయాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్...జగనన్నే మా భవిష్యత్' అనే కార్యక్రమాన్ని కిలిచినపేట, ఇందిరానగర్, ఎరుకల కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వలమక్క, బ్రహ్మా, సద్దాం, చంద్ర, వీరాంజనేయులు, బాషా పాల్గొన్నారు.

కౌతాళం: బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ప్రహ్లాదాచారి, నదిచాగిలో ఎంపీటీసీ జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాల్ని సేకరించారు. అలాగే బదినేహాల్‌లో ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్ గ్రామంలో పర్యటించారు. కుంటనహాల్‌లో సర్పంచ్ పార్వతమ్మ, నాయకుడు శివరాం కార్యక్రమం నిర్వహించారు.

కోసిగి: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శనివారం కోసిగి-2 సచివాలయం పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. కాలనీలో వృద్ధ దంపతులు మాట్లాడుతూ..తమ కుమారులు పట్టించుకోకపోవడంతో జగనన్న ఇచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నామని చెప్పారు. సచివాలయ కన్వీనర్ బుల్లి నరసింహులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : సుపరిపాలన అందిస్తున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మేజర్ పంచాయతీ మండిగిరిలోని జీవనజ్యోతి ఆశ్రమం, మంజునాథ్ ఎస్టేట్, పద్మావతి, వెంకటేశ్వర ఎస్టేట్, మహిమ చర్చి వద్ద మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కన్వీనర్ ఉలిగప్ప, సీనియర్ నాయకులు కడితోట ఈరన్న, మండల నాయకులు వీరారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దొమ్మరి లక్ష్మన్న పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రామచంద్రనగర్‌లో సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును గురించి ఆరా తీశారు.

'మోదీని గద్దె దింపుదాం'

ఆదోని రూరల్ : ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్రమోదీని గద్దె దింపుదాం.. దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న, సీపీఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బసాపురం, చిన్నహరివాణం, చిన్న గోనేహాల్, హానవాల్, మదిరె గ్రామాల్లో ప్రచారభేరీ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శివర్గ సభ్యుడు నరసప్ప అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ..నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచేసి పేద, సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశానంటాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తుందని మండిపడ్డారు. తిక్కప్ప, చిన్న తిక్కన్న, నరసప్ప, గోవిందు, రామప్ప, ఉలిగేష్, రామలింగ, రంజిత్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

పెద్దకడబూరు: కేంద్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని వామపక్షల నాయకులు బాస్కర్‌యాదవ్, వీరేష్, తిక్కన్న, పరమేష్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవణలో ధర్నా చేసి ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అంజినేయ, జాఫర్‌పటేల్, తిక్కన్న, హనుమంతు, గిడ్డయ్య పాల్గొన్నారు.

జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వేరే ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారని, సంక్షేమ పథకాలు పొందాలంటే మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కుప్పగల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి పథకాలు, లబ్ధిని వివరించి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందజేయనన్ని సంక్షేమ పథకాలు అందజేసి, పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా అందజేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. పథకాల అమలు, అభివృద్ధిని చూపి టీడీపీ నేతలు ఓర్వలేక,


కుప్పగల్‌లో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

మనుగడ కోల్పోతామని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. నాలుగేళ్లలోనే ఇంతకుముందెన్నడూ జరగని అభివృద్ధి పనులు చేశామని, 95శాతం హామీలు నెరవేర్చామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జనార్దన్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఏపీఎం జనార్దన్, ఏపీఓ చక్రవర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్, కార్పొరేషన్ డైరెక్టర్లు మంజుల, రేణుక, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గరునాథ్‌రెడ్డి, యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు

కోసిగి: మండల కేంద్రంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపడుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం ఇరిగేషన్ ఏఈ వెంకటేష్, కాంట్రాక్టర్ బసిరెడ్డి స్టోరేజ్ ట్యాంక్ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ.38.50 లక్షలతో భూగేని చెరువులో ముళ్ల పొదలు, పూడికతీత, కరకట్ట పనులు చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 90శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ట్యాంక్ వరకు పైప్‌లైన్ పనులు చేసి నీటిని స్టోరేజ్ చేయడం, పిల్లర్‌బెడ్స్ పనులు చేయించాల్సి ఉందన్నారు. సర్వే నెంబర్ 196లో స్టోరేజ్ ట్యాంక్ విస్తీర్ణం 15.96 ఎకరాలు, 4.82 ఎంసీఎఫ్‌టీ నీటి సామర్థ్యం ఉండేలా పనులు చేపట్టినట్లు వివరించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి వెంకటరాజు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న అధికారులు

కబడ్డీ విజేతగా ఆదోని

ఆదోని అర్బన్ : అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక న్యూ గాంధీనగర్‌లో అండర్-19 కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా సింథటిక్ మ్యాట్‌పై ఫ్లెడ్ లైట్స్ మధ్య ఫైనల్ జరిగింది. ఇందులో మొత్తం 20 జట్లు పాల్గొనగా పెద్దహరివాణం జట్టు, ఆదోని ఫిలిప్స్ జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. పెద్దహరివాణం జట్టుపై 5 పాయింట్ల తేడాతో ఆదోని ఫిలిప్స్ జట్టు విజయం సాధించింది. శనివారం తెల్లవారుజామున ఆదోని ఫిలిప్స్ జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. పెద్దహరివాణం జట్టుకు రూ.5 వేలు ఇచ్చారు. నిర్వాహకులు అమర్‌ప్రకాష్, మారి, నాగరాజు, పరీషా, యల్లప్ప, జయరామ్, రవి పాల్గొన్నారు.


గెలుపొందిన జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మంత్రాలయం రూరల్: మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలో పాండు, మాధవరం గ్రా మంలో తిమ్మప్ప అనుమతులు లేకుండా శనివారం ఇసుక అక్రమంగా తరలిస్తుండగా మంత్రాలయం, మాధవరం పోలీసులు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోని అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జాగ్రత్తలను వివరించే కరపత్రాలను అందజేశారు. అనంతరం ప్రమాదాలను నివారించేందుకు పరికరాలతో డెమో ద్వారా వివరించారు.

జయప్రదం చేయండి

కౌతాళం: ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి జగదీష్ కోరారు. శనివారం మహాసభల పోస్టర్లను సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ చట్టాలను మార్చి, కార్మికుల శ్రమ దోపిడీకి తెరతీసిందని విమర్శించారు. మల్లి, మహబుబ్‌బాషా, ప్రహ్లాద, వెంకటేష్, ఖాదర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఆదోని టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని మండిగిరి లేఅవుట్, జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. శనివారం కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణంరెడ్డి, హౌసింగ్‌బోర్డు అధికారులు జగనన్న కాలనీని సందర్శించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్న చలివేంద్రం స్థలాన్ని పరిశీలించారు.

ఆస్తి పన్ను చెల్లించండి..

మున్సిపాలిటీ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. ఈనెల 30వ తేదీలోగా పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ

ఆదోని టౌన్ : పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల నర్సింగ్ విద్యార్థులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శిక్షణకు అర్హత సాధించారు. 81 మంది విద్యార్థులు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.లింగన్న, డాక్టర్ పద్మకుమార్ ఆధ్వర్యంలో శిక్షణలో పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ దేవదానం, ప్రిన్సిపాల్ విజయకుమారి, సభ్యులు మోనా, దినాకర్, వీరేష్, రాజు, రంగా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ 42 మంది నర్సింగ్ విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్లు 37 మంది, ఇద్దరు ఫిజియోథెరపి మొత్తం 81 మంది ఆస్పత్రిలో శిక్షణ పొందుతారని చెప్పారు.


శిక్షణకు ఎంపికైన నర్సింగ్ విద్యార్థులు

ఫ్లోరైడ్ బాధిత గ్రామాల్లో పర్యటిస్తాం

- సమస్య పరిష్కారానికి చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావానికి గురైన గ్రామాలను సందర్శించి అక్కడి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన చెప్పారు. శనివారం నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న 42 మందికి వీల్‌చైర్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మెజారిటీ మండలాల్లో ఫ్లోరోసిస్ ఉందని, ఆయా ప్రాంతాలకు సురక్షిత తాగునీటిని అందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాలను సందర్శించి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్లోరోసిస్ బాధితులకు రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ వారు రూ.2.10లక్షల విలువైన వీల్‌చైర్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే తరహాలో ప్రజలకు విస్తృతంగా సేవలు అందించాలని ఆమె సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో విస్తృతంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.మహేంద్రకుమార్, సభ్యులు డాక్టర్ కేవీ. సుబ్బారెడ్డి, జి. శ్రీనివాసులు, అరుణ, మధుసూదన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, రెడ్‌క్రాస్ రక్తనిధి వైద్యాధికారి డాక్టర్ రామచంద్రరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫ్లోరోసిస్ బాధితులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

మట్టి నమూనాలు సేకరించాలి


మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణకుమారి


మట్టి పరీక్షలపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దకడబూరు:భూసార పరీక్షల నిమిత్తం ప్రతిగ్రామంలో మట్టి నమూనాలు సేరించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణకుమారి తెలిపారు.నేల ఆరోగ్యం, మట్టి పరీక్షలపై మండల వ్యవ సాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్.మురవణి గ్రామంలో శనివారం రైతుభరోసా సిబ్బందికి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 50కి పైగా మట్టి నమూనాలను సేకరించాలన్నారు.పంటలు సరిగా పండని భూములను గుర్తించివాటిలో సేకరించిన మట్టి నమూనాలైతే పరిష్కారం సులభం అవుతుందన్నారు. మట్టి నమూనాల సేకరణకు ఏప్రేల్,మేనెలలు అనువుగా ఉంటాయన్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని చిలకలడోణ గ్రామంలో ఏవో జీరాగణేష్ ఆధ్వర్యంలో శనివారం నేల ఆరోగ్యం, మట్టి పరీక్షపై మండలంలోని వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మట్టిని ఎలా, ఎంత మోతాదులో సేకరించి ల్యాబ్‌కు పంపాలి, మట్టిలో ఏఏ పోషకాలు ఉన్నాయో ఎలా తెలుసుకోవాలి అనే అంశాలను క్షుణంగా వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుల మందులను వాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అలా జరగకుండా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆర్బీకేల్లో చేయాల్సిన పనుల గురించి వివరించారు. ఏఈఓ నరసింహులు, రేఖామాధురి ఉన్నారు.

ఆదోని రూరల్ : మండల వ్యవసాయశాఖ పరిధిలో శనివారం మట్టిమూనాలు సేకరించే విధానంపై ఏడీఏ గిరీష్ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఖరీఫ్ 2023-24 సీజన్‌లో భాగంగా ఈ సంవత్సరం భూసార పరీక్షలు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ అధికారి బి.శశిధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డి, మండలంలోని 37 ఆర్‌బీకేలకు సంబంధించిన వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

ఆస్పరి: మండలంలోని చిగిళిలో శనివారం శ్రీగిరి కట్టెల తిప్పన్న తాత రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో తిప్పన్న తాతకు గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. నందికోలు సేవ, మంగళవాయిద్యాలతో తాత ఉత్సవ విగ్రహన్ని ఊరేగించారు. అనంతరం అశేష భక్తజనం మధ్య రథాన్ని గ్రామం చివర ఉన్న ఎదురు బసవన్న ఆలయం వరకు లాగారు. ఈ వేడుకను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.


భక్తజనం మధ్య తిప్పన్న తాత రథోత్సవ దృశ్యం

ఆకట్టుకున్న బసవేశ్వరస్వామి ప్రవచనం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కల్బుర్గి శ్రీశరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రవచన కారుడు సిద్ధరామయ్యస్వామి శరణ బసవేశ్వరస్వామి లీలలు గురించి వివరించారు. ధర్మకర్తలు రాజ పంపన్న గౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రవచనాలు వినిపిస్తున్న సిద్ధరామయ్య స్వామి